విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily




సంపుటి : 4 సంచిక :36 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ మంగళవారం 30 జూన్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ఐకానిక్‌గా అసెంబ్లీ, హైకోర్టు
# నిర్మాణాలు

- ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి: సీఎం చంద్రబాబు
- అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు




అమరావతి

దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్

వివరాలు 2లో..



# రూ.30 వేల కోట్ల బకాయిలు ఇవ్వకపోతే భారీ ఉద్యమం తప్పదు

- ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కీలక డిమాండ్లు
- ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- పెండింగ్‌లో ఉన్న రూ. 30 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

అమరావతి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తక్షణమే ఉద్యోగ సంఘాలను అధికారికంగా చర్చలకు ఆహ్వానించాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ

వివరాలు 2లో..



## ఎన్నికలు జరిపే దేశాల్లో భారతదేశానికి ఒక మంచి గుర్తింపు

- పారదర్శక ఎన్నికల ప్రక్రియల్లో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహిస్తోందని వ్యాఖ్యానించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- ప్రజాస్వామ్యానికి వారే మూల స్తంభాలు
- ఈ పనులన్నింటినీ రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు కూడా స్వయంగా చూసి తనిఖీ చేసుకోవచ్చు

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే



- ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే
- రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే
- ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

## ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని ప్రజలకు కల్పించాలి




- ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న సీఎం
- రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలన్న చంద్రబాబు



## అమర్‌నాథ్ యాత్రకు శ్రీకారం..

- పవిత్ర గుహలో ప్రథమ పూజ.. ఈసారి హెలికాప్టర్లు బంద్
- పూజలో పాల్గొన్న జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా
- జులై 3 నుంచి ఆగస్టు 28 వరకు 57 రోజుల పాటు కొనసాగనున్న యాత్ర
- ఈ ఏడాది బేస్ క్యాంపుల నుంచి హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని ప్రకటన
- యాత్ర భద్రత, ఏర్పాట్లపై లెఫ్టినెంట్ గవర్నర్ భక్తులకు భరోసా

## గాజువాక నుంచి భోగాపురం విమానాశ్రయానికి
# ఎలక్ట్రిక్ బస్సులు



- రెండు రూట్లు ఖరారు
- ప్రయాణికులకు 9 చోట్ల వెయిటింగ్ లాంజ్‌లు
- జులై మొదటి వారంలో ట్రయల్ రన్

అమరావతి

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తున్న వేళ అక్కడికి ప్రయాణికులు చేరుకోవడానికి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. విద్యుత్తు బస్సులు నడపడానికి ప్రణాళిక రూపొందించి ప్రాథమికంగా రెండు రూట్లను ఖరారు చేసింది. విశాఖ నుంచి భోగాపురం వెళ్లడానికి రెండు గంటలు, భోగాపురం నుంచి విశాఖ వచ్చేందుకు గంటన్నర సమయం పట్టనున్నట్లు అధికార యంత్రాంగం

వివరాలు 2లో..



## హర్ముజ్ సంక్షోభంలో భారత్ విజయం

- టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు
- హర్ముజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- ఆ సమయంలో కేంద్ర తీసుకున్న చర్యలను వివరించిన హర్దీప్ సింగ్ పురీ
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి
- ఈ చర్యల వల్లే వినియోగదారులపై ప్రభావం పడలేదని వ్యాఖ్య

## త్వరలో రాష్ట్ర విద్యారంగంలోకి
# ఏఐ ట్యూటర్

- కష్టపడి చదవండి.. మీ కలలు నెరవేర్చే బాధ్యత నాది: మంత్రి నారా లోకేశ్
- సమాజంలో మార్పు కోసం కొంతమంది విద్యార్థులైనా రాజకీయాల్లోకి రావాలని పిలుపు
- షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు విని తక్షణ సాయంపై హామీలు
- ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని వెల్లడి



అమరావతి

"మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు.

వివరాలు 2లో..

# రూ.30 వేల కోట్ల బకాయిలు ఇవ్వకపోతే భారీ ఉద్యమం తప్పదు

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను వివరిస్తూ ఆమెకు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్ర ప్రభుత్వం ముందు బొప్పరాజు పలు కీలక డిమాండ్లను ఉంచారు. 'గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగులకు సంబంధించి సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి చెల్లింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. ఉద్యోగులకు కొత్త పీఆర్సీ (వేతన సవరణ సంఘం) ఇచ్చేందుకు తక్షణమే కమిషన్‌ను నియమించాలి. పీఆర్సీ నివేదిక వచ్చి అమలు జరిగే వరకు, ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను వెంటనే మంజూరు చేయాలి. ఉద్యోగులకు రావాల్సిన లీవ్ ఎరియర్స్, సరెండర్ లీవ్ నగదును తక్షణమే విడుదల చేయాలి' అని కోరారు.

"ఐదు డీఏలు సుమారుగా 10 శాతం పైన 100కి 10 రూపాయల పైన ఈరోజు ప్రభుత్వం విడుదల చేయాల్సిన బకాయిలే ఉన్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక, అది కాకుండా ఈ రెండు సంవత్సరాల నుంచి ఆ డీఏలకి ఏరియర్స్ కింద ఎన్ని వేల కోట్లు రావాలో లెక్కేయండి, ఇవి ఎప్పుడు చెల్లిస్తారో చెప్పండి. ఇంతవరకు ప్రకటన లేదు, ఏరియర్స్ సంగతి లేదు. అదేవిధంగా మూడు సంవత్సరాల క్రితం నుంచి అమలు కావాల్సినటువంటి పీఆర్సీ, ఈరోజుకు ఆ పీఆర్సీ కమిషన్ నియామకం కూడా లేదు. 'మేము అధికారంలోకి రాగానే మంచి ఐఆర్ ప్రకటిస్తాం' అని చెప్పినటువంటి ప్రభుత్వం, ఆ ఊసే ఇప్పుడు ఎత్తడం లేదు. ?ఈరోజు ఒక్క సరెండర్ లీవ్ కూడా పోలీసులయితే చాలా బాధపడేటువంటి పరిస్థితి.



దాదాపు 7 వేల కోట్ల పైచిలుకు సరెండర్ లీవ్ల బకాయిలు ఉన్నాయంటే ఆలోచించండి. అంటే గత ప్రభుత్వంలో ఉన్నటువంటి వేల కోట్ల బకాయిల లెక్కలు చెప్పట్లేదు. ఎవరెవరికి ఎంతెంత చెల్లించాలో చెప్పమంటే చెప్పరు. ఈ ప్రభుత్వ హయాంలో మీరు వచ్చిన తర్వాత ఆర్థికంగా ఏ ఒక్క ప్రయోజనానికి కూడా మాకు ఏమి ఇవ్వాలో, ఏమి ఇవ్వకూడదో చర్చించినటువంటి దాఖలాలు కూడా లేవు." - బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్

**సన్నాహక సభల షెడ్యూల్**

ఆర్థికపరమైన ఇబ్బందులతో రాష్ట్రంలోని ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని బొప్పరాజు తెలిపారు. వారిని పోరాటానికి సన్నద్ధం చేసేందుకు ఏపీ జేఏసీ అమరావతి కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. జూలై 12వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో 'ఉద్యమ సన్నద్ధత తొలి సభ'ను భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత జూలై 21న అనంతపురంలో రెండో సభను నిర్వహించేందుకు ప్లాన్ చేశామన్నారు. అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇలాంటి సన్నాహక సభలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని బొప్పరాజు స్పష్టం చేశారు. ఏపీ ఎన్జీవోలతో పాటు కలిసివచ్చే ఇతర అన్ని ఉద్యోగ సంఘాలను ఏకం చేస్తామన్నారు.

# గాజువాక నుంచి భోగాపురం విమానాశ్రయానికి ఎలక్ట్రిక్ బస్సులు

-మొదటిపేజీ తరువాయి

ప్రాథమికంగా గుర్తించింది. ప్రయాణ సమయం, విమాన సర్వీసుల వేళలను ఆధారంగా చేసుకొని బస్సులు నడపనున్నారు.

**రెండో రూటు**

గాజువాక నుంచి సింధియా మీదుగా భోగాపురం (రైల్వేస్టేషన్, బస్టాండ్, వీఎంఆర్‌డీఏ పార్కు, రుషికొండ, ఐటీ హిల్స్, మారికవలస, ఆనందపురం)

ఈ ప్రాంతాల్లో లాంజ్‌లు: విమాన ప్రయాణికుల కోసం తొమ్మిది చోట్ల వెయిటింగ్ లాంజ్‌లు ఏర్పాటు చేయనున్నారు. 30 నుంచి 40 మంది ప్రయాణికులకు సరిపోయేలా వీటిని నిర్మించనున్నారు. అవసరమైతే బోర్డింగు పాసులు అందులోనే తీసుకొని లగేజి అక్కడే వదిలేసి నేరుగా విమానం ఎక్కించేలా ఆలోచన చేస్తున్నారు.

**ప్రతి అరగంటకు ఒక బస్సు**

మొదటి దశలో ఆటోనగర్, ఎన్ఏడీ, గురుద్వారా, వెంకోజిపాలెం, ఎండాడ వద్ద ఆ లాంజ్‌లను ఏర్పాటు చేసి తర్వాత హనుమంతువాక, ఆర్టీసీ కాంప్లెక్సు, వీఎంఆర్‌డీఏ పార్కు, రైల్వేస్టేషన్ వద్ద అందుబాటులోకి తేనున్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు అక్కడికి వచ్చేలా ప్రణాళిక రచిస్తున్నారు. కొన్ని బస్సులు కేవలం లాంజ్‌ల వద్దే ఆగేలా, మరికొన్ని మద్దిలపాలెం, మురళీనగర్, షీలానగర్, మధురవాడ, కొమ్మాది, ఆనందపురం వద్ద కూడా నిలిపేలా అదనపు స్టేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**మొదటి దశలో 20 విద్యుత్తు బస్సులు**

విశాఖ నుంచి భోగాపురానికి మొదటి దశలో 20 విద్యుత్తు బస్సులు నడపనుండగా డిమాండు ఆధారంగా వాటిని 50 వరకు పెంచనున్నారు. గాజువాక - భోగాపురం రూట్లో పది, సింధియా మీదుగా మరో పది నడపనున్నారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే అదివివరం రూటూ పరిశీలించనున్నారు.

పుణె నుంచి విద్యుత్తు బస్సులు: త్వరలో ప్రయోగాత్మక



పరిశీలన చేస్తామని ఆర్టీసీ ఆర్ఎం అప్పల నాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ " జులై మొదటి వారంలో పుణె నుంచి విద్యుత్తు బస్సులు విశాఖ వస్తున్నాయి. వచ్చిన వెంటనే ప్రయోగాత్మకంగా పరిశీలన చేపట్టనున్నాం. ఇప్పటికే రూటు పరిశీలన సర్వే పూర్తయింది. ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేస్తాం " అని తెలిపారు.

**యూడీఎఫ్ ఛార్జీలు**

భోగాపురం విమానాశ్రయం నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరే దేశీయ ప్రయాణికులకు రూ.835 చొప్పున, అలాగే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకునే ప్రయాణికులకు రూ.355 చొప్పున యూడీఎఫ్ ఛార్జీలు వర్తించనున్నాయి. ఇక అంతర్జాతీయ సర్వీసుల విషయానికి వస్తే భోగాపురం నుంచి విదేశాలకు బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికులకు రూ.1,255 గానూ, విదేశాల నుంచి నేరుగా ఇక్కడికి వచ్చే ప్రయాణికులకు రూ.545 గానూ ఈ తాత్కాలిక రుసుములను ఇటీవల ఖరారు చేశారు.

**అభివృద్ధికి సరికొత్త బాటలు**

ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన వ్యాలిడేషన్ ఫ్లైట్ విజయవంతం కావడంతో, ప్రాజెక్ట్ సంసిద్ధతపై ముందడుగు పడింది. ఏపీలో సరికొత్త గ్రీన్?ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తోంది. ఏదైమైనా భోగాపురం విమానాశ్రయం పూర్తైతే ఏపీలో ఉన్న పర్యాటక సామర్థ్యాన్ని వెలికితీస్తుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన ఈ ప్రాజెక్ట్ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడంతో పాటు పెట్టుబడులను కూడా ఆకర్షిస్తుంది. ఈ ప్రాంతాన్ని ప్రపంచ విమానయాన, వాణిజ్య పటంలో సుస్థిరంగా నిలుపుతుంది.

# ఏపీ కేజీఎఫ్...జొన్నగిరి

**కర్నూలు :** మార్కెట్లోకి ఆంధ్ర బంగారం వచ్చేసింది. మేడిన్ ఆంధ్ర బంగారానికి మార్కెట్లో చోటు దక్కింది. కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ మైన్స్ నుంచి గోల్డ్ మార్కెట్లోకి తీసుకొచ్చారు. జియో మైసూర్ సంస్థ తయారుచేసిన 50 గ్రాములు, 100 గ్రాములు, 500 గ్రాముల బిస్కెట్లు షాపుల్లో కనిపిస్తున్నాయి. ఏపీ మ్యాప్ తో పాటు జొన్నగిరి గోల్డ్ మైన్స్ పేరుతో ముద్రవేశారు. ప్రస్తుతం కర్నూలులోని షరాబు బజారుకు చెందిన కొందరు వ్యాపారుల దగ్గర ఈ బిస్కెట్లు లభిస్తున్నాయి. బంగారం స్వచ్ఛత తెలిసేలా 999 నెంబర్ కూడా ముద్ర వేశారు. 24 క్యారెట్ల స్వచ్ఛత ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం ఈ 500 గ్రాముల బిస్కెట్ విలువ అక్షరాల రూ.75 లక్షలు పై మాటే. జొన్నగిరి గోల్డ్ మైన్స్ నుంచి ప్రస్తుతానికి 100 కిలోలు మాత్రమే ఉత్పత్తి చేసి విక్రయించినట్లు కర్నూలు బంగారం వ్యాపారులు చెబుతున్నారు.ఇటీవల కర్నూలు జిల్లాలో జొన్నగిరి ప్రాంతంలో దేశంలోనే అతిపెద్దదైన ప్రైవేట్ బంగారు గొనుల ప్రాజెక్టు ఉత్పత్తి మొదలైంది. 405 కోట్ల ఖర్చుతో ఇక్కడ బంగారాన్ని ఉత్పత్తి చేయడం మొదలుపెట్టారు. జొన్నగిరి ప్రాంతంలో తయారైన బంగారాన్ని బయటకు విడుదల చేశారు. బ్రాండ్ ఏపీ పేరుతో ఈ బంగారాన్ని విక్రయిస్తున్నారు. రాయల్టీ రూపం లో జొన్నగిరి ద్వారా భారీగానే ఏపీ ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.జొన్నగిరి వల్ల కర్నూలు జిల్లా స్వర్ణ గిరిగా మారిపోయింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఇప్పుడు మరో కేజీఎఫ్ ఆంధ్రప్రదేశ్లో వెలుగులోకి వచ్చింది. అది కూడా చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోని గడుపల్లె మండలంలోని చిగురు గుంట ప్రాంతంలో ఉంది.సరిగా 2001లో ఇక్కడ గోల్డ్ మైన్స్ మూతపడ్డాయి. ఇప్పుడు వాటిని తెరిపించేందుకు ఏపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇటీవల ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఇందులో రెండు కంపెనీలు పాల్గొన్నారు. గతంలో 263 హెక్టార్లలో ఇక్కడి గనులు విస్తరించి ఉన్నాయి. తాజాగా నిర్వహించిన సర్వేలో మరో తొమ్మిది హెక్టార్లను ఇందులో కలిపారు. గత ఎడాది ఇక్కడి బంగారు నిక్షేపాలపై అధికారులు సర్వే చేశారు. నివేదిక కూడా అందించారు. ఆ నివేదిక ప్రకారం ఇక్కడ 18 లక్షల టన్నుల ముడి బంగారు ఖనిజం ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.. ఒక టన్ను ముడి ఖనిజం నుంచి దాదాపు 5.5 గ్రాముల బంగారం లభిస్తుంది. ఈ ప్రకారం అక్కడ 8.5 టన్నుల బంగారం ఉండవచ్చని సమాచారం. ఒకవేళ ఈ మైండ్స్ మళ్లీ మొదలయితే 5000 మందికి ఉపాధి లభిస్తుంది.వాస్తవానికి ఈ గని ఇప్పటిది కాదు. దశాబ్దాల క్రితమే ఇక్కడ ముడి ఖనిజాన్ని తవ్వారు. అప్పట్లో గుడిపల్లె మండలంలో రెండు ప్రాంతాలలో గోల్డ్ మైన్స్ ఉన్నాయని గుర్తించారు. బిసానత్తం ప్రాంతంలో 1968, చిగురు గుంటలో 1978లో తవ్వకాలు మొదలుపెట్టారు. నాడు ఎంఈసిఎల్ సంస్థ ఆధ్వర్యంలో తవ్వకాలు ప్రారంభించారు. ఇక్కడ లభించే క్వార్జ్ రాయిని వెలికి తీసి.. విక్రయించడం మొదలుపెట్టారు. ఎంఈసిఎల్ దాదాపు 10 సంవత్సరాలపాటు క్వార్జ్ ను వెలికి తీసింది. నాడు కేజీఎఫ్ లోని భారత్ గోల్డ్ మైనింగ్ లిమిటెడ్ కు అందించింది. అయితే ఆర్థిక ఇబ్బందుల్లో ఈ సంస్థ చెప్పుకోవడంతో ఘనుల నిర్వహణ కష్టంగా మారింది. ఆ తర్వాత ఇక్కడి గనులను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీజీఎమ్ఎల్ 1982లో విక్రయించింది. 2001 వరకు ఇక్కడ బిజీ ఎంఎల్ సంస్థ ముడి ఖనిజాన్ని వెలికి తీసింది. ఆ తర్వాత అనేక సమస్యలు ఎదురు కావడంతో ఈ గనులను మూసివేస్తూ బిజిఎంఎల్ నిర్ణయం తీసుకుంది. ఈ గనులకు సంబంధించి 263ఎ హెక్టార్ల భూమిని 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపిక చేసింది. బంగారం అన్వేషణలో భాగంగా 150 బోర్లు డ్రిల్ చేసింది.త్వరలో పూర్తిస్థాయిలో వినియోగదారుల కోసం మార్కెట్లోకి విడుదల చేస్తామని చెబుతున్నారు. ఈనెల 24న సీఎం ప్రారంభించిన వెంటనే కర్నూలుకు చెందిన బంగారం వ్యాపారులు కామిశెట్టి జగదీష్, చక్రవర్తి, శ్రీహరి మూర్తి తో పాటు పలువురు వ్యాపారులు బంగారాన్ని కొనుగోలు చేశారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగానే ఈ బంగారాన్ని అందుకున్నారు. ఓ వ్యాపారి ఒక గోల్డ్ బిస్కెట్ను వినియోగదారులకు విక్రయించినట్లు కూడా చెప్పారు. అయితే ఏపీ బంగారం దేశీయ మార్కెట్లోకి ప్రవేశించడం మాత్రం నిజంగా శుభపరిణామం.జొన్నగిరి గోల్డ్ మైనింగ్ తో విదేశీ మరకద్రవ్యం దేశం దాటిపోదాంటున్నారు వ్యాపారులు. ప్రస్తుతానికి ప్రభుత్వం ఎలాంటి పన్నులు, రాయితీలు లేవు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారానికి ఏ పన్నులు వర్తిస్తాయో.. జొన్నగిరిలో బంగారానికి కూడా వర్తిస్తాయని చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో ఈ గోల్డ్ మైనింగ్ ప్రారంభం కావడంతో.. జువెలరీ క్లస్టర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**మార్కెట్లో సందడి**

ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలిసారిగా రాష్ట్రంలోనే తవ్వకాల ద్వారా వెలికితీసిన మేలిమి బంగారం మార్కెట్లోకి వచ్చింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గోల్డ్ మైన్‌లో ఉత్పత్తి చేసిన 99శాతం స్వచ్ఛత కలిగిన బంగారు బార్లు ఇప్పుడు కర్నూలు నగరంలోని షరాఫ్ బజార్‌లోని జ్యువెలరీ దుకాణాల్లో అందుబాటులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సింబల్‌తో రూపొందించిన ఈ బంగారం వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది.2015 నుంచి జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జొన్నగిరిలో బంగారు నిక్షేపాల వెలికితీత కొనసాగుతోంది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ బంగారం ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో రాష్ట్రంలోనే తొలిసారిగా ఉత్పత్తి అయిన బంగారం ప్రజలకు అందుబాటులోకి రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## త్వరలో రాష్ట్ర విద్యారంగంలోకి ఏఐ ట్యూటర్

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

**విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా**

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు. టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది. ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**చదువు మధ్యలో ఆగకూడదు.. అండగా ఉంటా**

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు. శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.

## ఐకానిక్‌గా అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు

-మొదటిపేజీ తరువాయి

టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని ప్రజలకు కల్పించాలి: సీఎం చంద్రబాబు

: ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్?లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మనమిత్ర వాట్సాప్‌లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించాలన్నారు. వాయిస్ మెసేజ్?లు చేసిన వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో సుమారు మూడు వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని దీనిని మూడు నెలల్లో పరిష్కరించాలని చెప్పారు. ఈ మేరకు నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడాలని సూచించారు. నవచేతన పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్?మెంట్ స్క్రీనింగ్ విధానంపై సమావేశంలో అధికారులు, ముఖ్యమంత్రికి ప్రజంటేషన్ ఇచ్చారు. పిల్లల ఎదుగుదల, వారి మానసిక, శారీరక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలను స్క్రీనింగ్ చేసినట్టు అధికారులు చంద్రబాబుకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేవారితో పాటు ఇళ్లకు కూడా వెళ్లి స్క్రీనింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్క్రీనింగ్‌తో పాటు ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు సీఎం సూచనల మేరకు క్షేత్రస్థాయి పర్యటనల విషయంలో సర్క్యులర్ జారీ చేశామని అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఈ మేరకు నెలలో సెక్రటరీలు 3 రోజులు, హెచ్ఓడీలు 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సర్క్యులర్ జారీ చేసినట్టు తెలియజేశారు. పీజీఆర్ఎస్ విధానం మరింత మెరుగ్గా పనిచేసేలా స్టాండర్ట్ ఆపరేటివ్ ప్రొసీజర్స్ జారీ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, సీఐఐ ప్రతినిధులను వెంటపెట్టుకుని సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కేంద్రానికి వచ్చారు. ఆర్టీజీఎస్ పనితీరును ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు

# అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.







**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:** పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ఇంచార్జ్ డిఆర్ఓ వై శ్రీనివాస్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రికల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ఆర్టీసీ, డ్వామ, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖిత పూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యల పై 131 అర్జీలు అందాయి. అదే విధంగా రెవెన్యూ క్లినిక్ కు 147 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఏపీలో పెన్షన్ల పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక ప్రకటన





**అమరావతి, జూన్ 29:** రాష్టంలో ఎప్పటి లాగే జులై నెల కోసం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల విడుదలకు రంగం సిద్దమవుతోంది. ఈ పెన్షన్ల కోసం ప్రభుత్వం ముందస్తుగానే నిధులు విడుదల చేయడం ద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తోంది.

ఈసారి కూడా ఆ విధంగానే మొత్తం రూ.2,711.79 కోట్ల నిధుల్ని జులై నెల పెన్షన్ల కోసం విడుదల చేసింది. దీనికి సంబంధించిన వివరాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ నెలలో 62,19,648 మంది పింఛన్ దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,711.79 కోట్లను విడుదల చేసినట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. జులై 1 వ తేదీ ఉదయం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఈ పెన్షన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కొత్తగా మంజూరైన 7,792 మంది వితంతు లబ్ధిదారులకు జులై 1న పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం రూ. 3.12 కోట్లను విడుదల చేసినట్టు కూడా మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ల కోసం ఈ నెల విడుదల చేసిన నిధులతో కలుపుకుని రూ. 68,598.44 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని మంత్రి శ్రీనివాస్ తెలిపారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నిధులను ప్రతి నెలా 1 వ తేదీనే లబ్ధిదారులకు అందిస్తోందని మంత్రి వెల్లడించారు. తాజాగా వితంతు పెన్షన్లను కూడా ఇస్తున్న ప్రభుత్వం, ఇతర కొత్త పెన్షన్ల పై త్వరలో నిర్ణయం తీసుకోనుందన్నారు.

# జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో ఉద్యమకారులకే ప్రాధాన్యం.



• అర్హత, సేవాభావమే నాయకత్వానికి ప్రమాణం కొణతాల.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:** నియోజకవర్గం లోని విజయ రెసిడెన్సీ హోటల్‌లో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణ సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గానికి పార్టీ సమాచారం సేకరణ కమిటీ పరిశీలకులుగా నియమితు లైన మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబు ని ఘనంగా స్వాగతించి మీడియాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచే నైతిక విలువలు, పారదర్శకతతో కూడిన రాజకీయ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. అదే దిశగా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సమాచారం సేకరణతో పాటు నాయకత్వ ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమం నుంచి ఎదిగిన సాధకులకు అవకాశాలు కల్పిస్తూ, రాష్ట్రానికి సమర్థ మైన నాయకత్వాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రతి జిల్లాకు సీనియర్ నాయకులను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు పెండెం దొరబాబు ని పరిశీలకులుగా నియమించినట్లు వెల్లడించారు.

ఆయన ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు సంస్థాగత ఎంపిక ప్రక్రియ నిర్వహించబ డుతుందని, పార్టీ సభ్యత్వం కలిగిన వారికే ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా 2014 లో పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలు, ఉద్యమకారులు, సాధకులకే ప్రాధాన్యం ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, స్క్రూటినీ అనంతరం పార్టీ హైకమాండ్‌కు పంపిస్తామని వివరించారు. ప్రతి జిల్లాలో 28 మంది సభ్యులతో కూడిన కమిటీతో పాటు కేంద్ర కార్యాలయం నుంచి ప్రత్యేక సపోర్ట్ టీమ్ కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. వ్యక్తిగత సిఫార్సులు, స్వార్థపూరిత నిర్ణయాలకు ఎలాంటి అవకాశం లేకుండా పూర్తిగా పారదర్శకంగా ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు.

చివరి నిర్ణయం పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వం లోని సెలక్షన్ కమిటీ తీసుకుంటుందని, కార్యకర్తలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా పార్టీ నిర్ణయాలను గౌరవించి సంస్థాగత బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గం జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# చెరీ చెరువు సుందరీకరణ పనులకు ఘనంగా శంకుస్థాపన.

శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో కలిసి శంకుస్థాపన చేసిన కలెక్టర్ విజయ క్రిష్ణన్.





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29** : ప్రతి పొలానికి నీరు అనే నినాదంతో నీటిపారుదల ద్వారా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, నీటి వృధాను తగ్గించి, నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో రూ. 50.00 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న "చెరీ చెరువు" సుందరీ కరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆవిష్కరించారు. అనంతరం

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డబ్ల్యూడిసిపి- పిఎంకేఎస్వై 2.0 పథకం కింద ఈ నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న చెరీ చెరువును ఆధునీకరించి, పునరుద్ధరించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచు కోవచ్చున్నారు. ఈ పునరుద్ధరణ పనుల వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందడమే కాకుండా, స్థానిక రైతులకు సాగునీరు, పశువులకు తాగునీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ డబ్ల్యూడిసిపి- పిఎంకేఎస్వై 2.0 ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి, కరవు పీడిత ప్రాంతాల రూపురేఖలను మార్చడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ ఏర్పాటు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:**విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి 28 మంది తో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ ని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడారు. నేటి నుంచి ఐదు రోజులపాటు జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు.

రోజుకు రెండు నియోజకవర్గాలు చొప్పున సమావేశాలు. నేడు జనసేన పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో కొత్త ఒరవడి కి స్వీకారం చుట్టారన్నారు.

నైపుణ్యం ఉన్న నాయకులను తయారు చేయాలనే ఉద్దేశంతో నూతన విధానంతో ముందుకు వెళ్తున్నారు. వినాశన మైన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంలో కూటమి నాయకులు విజయంతమయ్యారు. నిర్వీర్యం అయిపోయిన గ్రామ పంచాయతీ లకు పవన్ కళ్యాణ్ జీవం పోసారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. నూతన విధానంతో జనసేన పార్టీ పునర్నిర్మాణం జరుగుతుంది. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు, అన్ని విధాల పార్టీని, సిద్ధం చేసేందుకు ఈ ప్రక్రియ. భోగాపురం పూర్తి స్థాయిలో, సిద్ధమయ్యేవరకు విశాఖ ఎయిర్పోర్ట్ ని కొనసాగిస్తే మంచిదని నా అభిప్రాయం అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కూటమి పోటీ చేసి ఆ ప్రాంతాన్ని కైసం చేసుకోవాలనేది కూటమి ప్రయత్నం అని కొణతాల తెలియజేసారు.

# కళ్యాణ మండపం నిర్మాణం చేయాలని వినతి విష్ణుకుమార్ రాజు



**విజయనగరం, పెన్ సత్తా, జూన్ 29:**విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం లోని కప్పరాడ ఎన్‌జీఓస్ కాలనీ, 49 వ వార్డులో వెలసిన ప్రసిద్ధ వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి అవసర మైన కళ్యాణ మండపం నిర్మాణం చేయాలని వినతి.

మండపం నిర్మాణానికి, కోనేరు నిర్మాణం కోసం సింహాచలం దేవస్థానానికి చెందిన సుమారు 92 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు ఆధ్వర్యంలో సోమవారం గోవా గవర్నర్, వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం (సింహాచలం) ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు ని కలిసి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా విజయనగరంలో గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, ఆలయ ప్రాంగణానికి సమీపంలో ఉన్న సింహాచలం దేవస్థానం స్థలంలో భక్తుల సౌకర్యార్థం కోనేరు, కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పిస్తూ, ఈ నిర్మాణాలు ఆలయానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. దీని పై గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు సానుకూలంగా స్పందిస్తూ ఈ ప్రతిపాదన పై సింహాచలం దేవస్థానం కార్యనిర్వాహక అధికారితో చర్చించి, అవసర మైన స్థల కేటాయింపు పై తగిన చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు.

అనంతరం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహక అధికారి బి. ప్రసాద్, శేషాచార్యుల స్వామి బృందం గవర్నర్ కి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో సన్యాసి నాయుడు, శివాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి కలెక్టర్ విజయ క్రిష్ణన్.






**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29**: ఎస్సీ, ఎస్టీ ల పై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించేందుకు అమలులో ఉన్న ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం అమలు తీరును సమీక్షించేందుకు జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల పురోగతి, బాధితులకు అందించిన ఆర్థిక సహాయం, పునరావాస చర్యలు, కేసుల దర్యాప్తు న్యాయపర మైన చర్యల పై సమగ్రంగా సమీక్షించారు. బాధితులకు ప్రభుత్వం అందించే అన్ని రకాల సహాయాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఇంచార్జి డిఆర్ఓ వై.శ్రీనివాస రావు, అనకాపల్లి ఆర్డిఓ షేక్ అయేషా, సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం, సంబంధిత శాఖల అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రూ.40 లక్షలతో సునీల్ శర్మ కాలనీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధి.




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:**మధురవాడ జీవీఎంసీ జోన్-2 పరిధి లోని వాంబే కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ సునీల్ శర్మ హైస్కూల్ లో ఎంపీ నిధులతో నిర్మించిన నూతన తరగతి గదులను విశాఖ ఎంపీ ఎం. శ్రీ భరత్, భీమిలి యువ నాయకుడు గంటా రవితేజ ప్రారంభించారు. అనంతరం
ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ
రూ.40 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో పాఠశాలలో మూడు కొత్త తరగతి గదుల నిర్మాణం, భవనానికి ప్లాస్టరింగ్, పెయింటింగ్, ప్రతి అంతస్తులో గ్రిల్స్ ఏర్పాటు, లైట్లు, ఫ్యాన్లు అమర్చడం వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే స్కూల్ గ్రౌండ్ ను లెవెలింగ్ చేయడంతో పాటు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.
రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గతేడాది హైస్కూల్‌లో 380 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 440 కు, ప్రాథమిక పాఠశాలలో 160 నుంచి 180 కు పెరిగిందని, ఈ విద్యా సంవత్సరం లోనే అదనంగా 80 మంది కొత్త విద్యార్థులు చేరడం ఆనందకర విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందినప్పుడే మధ్యతరగతి కుటుంబాలు కూడా ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతాయని, అదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ శ్రీ భరత్ పేర్కొన్నారు.

# ఏరువాక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన గూడుపమ్మ ఆలయం

**నక్కపల్లి,పెన్ సత్తా జూన్ 29** : మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయం సోమవారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది.



ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి అమ్మవారి ఆలయాన్ని, ఉపాలయాలను దర్శించుకున్నారు. అమ్మవారికి మహిళలు పసుపు,కుంకుమలు సమర్పించారు. అమ్మవారికి హారతులిచ్చినప్పుడు అమ్మవారి నామంతో ఆలయం మార్మోగింది. మహిళాభక్తులందరికీ ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీ హరిరాజు ఆధ్వర్యంలో సౌభాగ్యప్రసాదంగా పసుపు కొమ్ములు, గాజులు పంపిణీ చేశారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు.





**అచ్యుతాపురం, పెన్ సత్తా, జూన్ 29**: మండలంలో గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరుకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనాన్ని ప్రభుత్వం నిధులతో పునరుద్ధరించి ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు.
ఈ పునరుద్ధరించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా
విజయ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ నేతలు మాజీ మంత్రి అంబటి రాంబాబు, పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పై విమర్శలు చేసారు. ఆంబోతు రాంబాబు కి నోరు వేసుకొని పడడం తప్ప మరి ఏమీ చేతకాదన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని తండ్రికి చరిత్ర ఉంది, తండ్రి చరిత్ర గురించి చెప్పుకుంటే పేర్ని నానికి హుందాగా ఉంటుందన్నారు.
అంబటి రాంబాబు, పేర్ని నానీలు కాపుల చరిత్ర గురించి మాట్లాడితే బాగుంటుంది. కాపు కులంలో కూడా దిగ్గజాలు ఉన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కరణం ధర్మశ్రీ వెకిలి మాటలు మానుకోవాలి. మరోసారి పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు చేస్తే ఊరుకున్నది లేదు అని హెచ్చరించారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ క్యాంపు కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే అచ్యుతాపురం మండల ప్రజలు తమ సమస్యలు, వినతులను ఈ క్యాంపు కార్యాలయం ద్వారా నేరుగా తెలియజేయవచ్చని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యాలయం పనిచేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన సైనికులతో నిర్వహించిన సమావేశం లో పంచకర్ల







కార్యకర్తలే నాయకులను ఎంపిక చేసుకోవడం జనసేనాని సిద్ధాంతం.

**అమలాపురం, పెన్ సత్తా, జూన్ 29:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం లో జనసేన పార్టీ నిర్మాణ సాధకుల సమాచార సేకరణ కమిటీ సభ్యులతో కలిసి 7 నియోజకవర్గాల జన సైనికులతో నిర్వహించిన సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు, అమలాపురం పార్లమెంట్ పరిశీలకులు పంచకర్ల రమేష్ బాబు.
సోమవారం అమలాపురం గండు వీధి కాపు కళ్యాణ మండపంలో 7 నియోజకవర్గాలు అమలాపురం, రాజోలు, గన్నవరం, రామచంద్రపురం, ముమ్మిడివరం మండపేట, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పంచకర్ల రమేష్ బాబు సమావేశమయ్యారు. ఆయనతోపాటు 28 మంది కమిటీ సభ్యులు, ఐదుగురు ఐటీ నిపుణులు, నియోజకవర్గం ఇన్చార్జ్ లు పాల్గొన్న ఈ సమావేశంలో సభ్యులతో పరిచయ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పార్టీ అభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలు, ఆయన ఆకాంక్ష, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళే సంకల్పం తదితర అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు. అటు పార్టీ కోసం, ఇటు రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేనాని చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను సమావేశంలో చర్చించారు. జనసేనాని నిస్వార్థంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తున్న ఫలాల పై సభ్యులందరూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజకీయాల్లో అధిష్టానం నాయకుల పేర్లు ప్రకటించడం, అవే శ్రేణులకు శిరోధార్యం కావడం జరుగుతోందని, పవన్ కళ్యాణ్ మాత్రం కార్యకర్తలకు నచ్చిన, వారు మెచ్చిన వారిని నాయకులుగా ఎన్నుకునే కొత్త విధానానికి అంకురార్పణ చేశారని వెల్లడించారు. ఈ క్రమం లోనే అమలాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకుడుగా తనను, మరో 28 మంది సభ్యులను, 5 ఐటి నిపుణులను కమిటీగా పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారని పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీ కార్యకర్తలే తమ నాయకుడిని ఎన్నుకునే కొత్త విధానానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టి ప్రజాస్వామ్యం పట్ల తనకున్న నిబద్ధతను, గౌరవాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. అసమర్థులను కార్యకర్తల నెత్తిన రుద్దడం కాకుండా, అందరికీ నచ్చే నాయకుడినే ప్రోత్సహించడం పవన్ కళ్యాణ్ సిద్ధాంతమని స్పష్టం చేశారు. కొందరు ప్రతిపక్షం లోని కాపు నాయకులు పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డ ఎమ్మెల్యే రమేష్ బాబు. ఇటీవల వరకు అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీల నాయకుల పై అలాంటి విమర్శలు చేయగలరా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ఏ కులానికో, మతానికో పరిమితమయ్యే నాయకుడు కాదని, అలాంటి నైజం అతనికి లేదని పేర్కొన్నారు. వైసిపి నాయకులు చేసిన తప్పుడు ప్రచారానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల స్పందించి తగిన విధంగా వారికి బుద్ధి చెప్పారని దీంతో వారు తోక ముడిచారని పంచకర్ల రమేష్ బాబు వెల్లడించారు. మరోసారి ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలే సరైన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అమలాపురం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శక్తి మంత్రం లేకుండా కృషి చేస్తామని రమేష్ బాబు స్పష్టం చేశారు. కార్యకర్తలు, నాయకుల నుండి పూర్తి సమాచారం సేకరించి అధిష్టానానికి పంపిస్తామని తెలియజేశారు.

# విఎంఆర్డిఏ లో అవినీతి, అక్రమాలు జరుగతున్నాయి అని ఆరోపణలు.



విఎంఆర్డిఏ లో టెండర్ల మాయాజాలం.
అంచనాలకు మించి భారీగా పెంపు.
టెండర్లన్నీ ఒక్కరికే దక్కే విధంగా అడ్డగోలు షరతులు.
ఉద్యోగులకు ఫేస్ రికగ్నిషన్ సిస్టం లేదు.
ఈ ప్రొక్యూర్మెంట్ నిబంధనలు బేఖాతారు.
జనసేన నేత పీతల మూర్తి యాదవ్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:**
పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు అవకాశం కల్పిస్తూ నిబంధనలకు విరుద్ధంగా పిలిచిన విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ(వీ ఎం ఆర్ డీ ఏ) మెయింటెనెన్స్ టెండర్లను రద్దుచేసి పారదర్శకంగా కొత్త టెండర్లు పిలవాలని జనసేన మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కోరారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అవినీతి రహిత పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వంలో విశాఖ మెట్రో రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ పలు మెయింటెనెన్స్ వర్కుల కోసం పిలిచిన మ్యాన్ పవర్ సప్లై టెండర్లు అవినీతి అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొంటూ సోమవారం పీజిఆర్ఎస్ లో వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్ కు వినతి పత్రం అందజేశారు. కేవలం ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా షరతులను విధించి, పని విలువను విపరీతంగా పెంచి పిలిచిన ఈ టెండర్లను వెంటనే రద్దు చెయ్యాలని కోరారు. విఎంఆర్డిఏ అధికారులు 4.5 కోట్ల పైగా విలువ చేసే పనులు కోసం ఇటీవల ఏడు టెండర్లు పిలిచారు. గతంలో కేవలం సగం ఖర్చుతో చేసిన పనులకు ఈసారి నాలుగున్నర కోట్ల రూపాయల ఖర్చవుతుందని అంచనా వేసి టెండర్లు పిలవడం, ఇందు కోసం ఐదు కోట్ల రూపాయల పని చేసిన అనుభవం ఉండాలనే సరికొత్త షరతు విధించడం అనుమానాస్పదంగా మారిందన్నారు. 50 లక్షల రూపాయల పని చేసేందుకు అందుకు పది రెట్లు ఐదు కోట్ల అనుభవం అడగటం అర్థ రహితం అన్నారు. కేవలం ఒక కాంట్రాక్టర్ కి ప్రయోజనం చేకూర్చేందుకే ఇలా పిలిచారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పది మంది కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనే విధంగా పారదర్శకంగా వ్యవహరించాల్సిన కొందరు అధికారులు కేవలం ఒకరిద్దరి కోసం ఈసారి టెండర్ నిబంధనలను ఈ విధంగా మార్చారని అర్థమవుతోంది. వీటిని వెంటనే రద్దు చేసి తిరిగి పారదర్శకంగా టెండర్లు పిలవాలి అని పేర్కొన్నారు.

స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీసెస్ నిబంధనలకు అతీతమా?.
స్కాట్లాండ్ సెక్యూరిటీ సర్వీసెస్ అనే సంస్థ పది-12 సంవత్సరాలుగా వీఎమ్ఆర్డీఏలో మ్యాన్ పవర్ సప్లై ఏజెన్సీగా పని చేస్తుంది. పలు ప్రాజెక్టుల్లో సెక్యూరిటీ సిబ్బందితోపాటు గార్డినర్లు సహాయకులు వంటి వారు ఈ సంస్థ ద్వారా పనిచేస్తున్నారు. అయితే విచిత్రంగా గత ఆరు సంవత్సరాలుగా ఈ సంస్థ సేవలను కొనసాగించేందుకు అసలు టెండర్లే పిలవలేదు. కొందరు అధికారులు ప్రతి నెలా లక్షల్లో మామూలు అందుకుంటూ ఈ సంస్థకు బినామీలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ సంస్థ ద్వారా రెండు వందల మంది పైగా పనిచేస్తున్నారు అని చూపిస్తున్నప్పటికీ నిజానికి ఫీల్డ్ లో సగం మంది కూడా ఉండటం లేదు. ఎంత మంది విధులకు హాజరవుతున్నారు అన్న దాని పై తనిఖీలు కానీ, ముఖ హాజరు కానీ జరగటం లేదు. ఈ సంస్థ చేస్తున్న ప్రాజెక్టులకు సంబంధించిన పనులకు పారదర్శకంగా టెండర్లు పిలవాలి అని కోరారు. ఏపీ ఈ ప్రక్రియమెంట్ లో వున్నా టెండర్ నిబంధనలు కాకుండా ప్రత్యేక షరతులు తో టెండర్లా?.
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ సంస్థలన్నీ ఆంధ్రప్రదేశ్ ఈ ప్రక్రియ ద్వారా టెండర్లు పిలుస్తాయి. అయితే విచిత్రంగా విఎంఆర్డిఏ మాత్రం దానిని గుర్తించకుండా ఇష్టానుసారంగా ప్రత్యేక షరతులు పెట్టి సొంతగా టెండర్లు పిలుస్తోంది. ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా వెళితే నిబంధనలన్నీ పాటించాలన్న కారణంగానే సొంతగా టెండర్లు పిలుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి అని మూర్తి యాదవ్ ఆరోపించారు.
జీవీఎంసీ ని కాదని చెత్త తొలగింపు?.
విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని జీవీఎంసీ నిర్వహిస్తోందని, జీవీఎంసీను కాదని విఎంఆర్డిఏ 50 లక్షల రూపాయల ఖర్చుతో చెత్త తొలగింపుకు టెండర్లు పిలవటం విచిత్రంగా ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాఖ నగర పరిధిలో చెత్త తొలగింపు కాంట్రాక్టును నేరుగా జీవీఎంసీకే బదలాయించవచ్చని, అందుకు విరుద్ధంగా టెండర్లు పిలవడం వెనుక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.
ఎస్.ఎల్.ఎఫ్ ల ద్వారా ఇవ్వండి.
మహా విశాఖ నగరపాలక సంస్థ ఆదర్శప్రాయంగా స్లం లెవెల్ ఫెడరేషన్ ద్వారా ఈ తరహా టెండర్లను ఇస్తుంది. టెండర్ మొత్తంలో రెండు శాతం కమిషన్ను మహిళలతో కూడిన ఈ ఫెడరేషన్లకు కమిషన్ గా అందజేస్తూ వారి ద్వారానే జీతభత్యాలు ఈఎస్ఐ, పిఎఫ్ వంటి వాటిని జమ చేయిస్తుంది. దీని ద్వారా జరగటం వల్ల పారదర్శకతతో పాటు మహిళలకు ఉపాధి కల్పించినట్లు అవుతుంది. అయితే వి ఎం ఆర్ డి ఏ ఈ పనులు కాంట్రాక్టర్ ద్వారా చేయించడం వల్ల చాలామంది కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ లు జమ కావడం లేదు. విఎంఆర్డీఏలో వీటిని తనిఖీ చేసి నిర్ధారించే నాధుడే కనిపించడం లేదు అని పేర్కొన్నారు.
ఫేస్ రికగనైజషన్ సిస్టం వాడరా!.
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పనికి వచ్చే కార్మికుల గుర్తింపు కోసం ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అవలంబిస్తున్నాయి. చివరకు పనికి ఆహారం పథకంలో కూడా ఈ విధానాన్ని వాడుతున్నారు. జీవీఎంసీ మూడు నెలల మలేరియా వర్కర్స్ కోసం తాత్కాలికంగా తీసుకునే ఉద్యోగుల విషయంలో కూడా ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఫేస్ రికగ్నిషను వినియోగిస్తున్నారు. అటువంటిది విఎంఆర్డిఏ లో దానిని వినియోగం లోకి తీసుకురావకపోవడం దారుణం. వెంటనే దాని ద్వారా విధులకు హాజరయ్యే కార్మికుల హాజరు నిర్వహించాలి అని డిమాండ్ చేశారు.

# స్వామివారి కృష్ణాపురం గోశాలలో ఘనంగా ఏరువాక ఉత్సవం.





- వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా భూమాత పూజలు
- నాగలితో దుక్కి దున్ని విత్తనాల చల్లిన ఆలయ ఈఓ జల్లేపల్లి వెంకట్రావు.

**సింహాచలం, పెన్ సత్తా, జూన్ 29:** వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జ్యేష్ఠ పౌర్ణమి (ఏరువాక పున్నమి) సందర్భంగా సోమవారం స్వామివారి కృష్ణాపురం గోశాలలో ఏరువాక ఉత్సవాన్ని అత్యంత వైభవంగా, వేదోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని ప్రారంభించి, భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో వ్యవసాయానికి శ్రీకారం చుట్టే పవిత్ర దినంగా భావించే ఏరువాక పున్నమి సందర్భంగా, కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి వెంకట్రావు, ధర్మకర్తల మండలి సభ్యులు ఉషశ్రీ, సన్యాసిరావు లతో కలిసి నాగలితో భూమిని దున్ని, విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, రైతే దేశానికి వెన్నెముక, రైతు శ్రమ వల్లే ప్రపంచానికి అన్నం లభిస్తుందని అన్నారు. వేదకాలంలో ప్రతి పనిని యజ్ఞంగా భావించేవారు. అదే స్ఫూర్తితో వ్యవసాయాన్ని పవిత్ర వృత్తి గా గుర్తిస్తూ జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పూర్ణిమగా జరుపుకుంటున్నాం అని తెలిపారు.

భూ మాతను పూజించి వ్యవసాయ పనులను ప్రారంభించడం భారతీయ సంస్కృతిలో చిరకాలంగా వస్తున్న గొప్ప సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం జ్యేష్ఠ నక్షత్రంలో నాగలి పట్టి పనులు ప్రారంభించడం అత్యంత శుభప్రదమని, అందుకే రైతులు వర్షాకాలం ప్రారంభంలో ఎడ్లను శుభ్రపరిచి, వాటి కొమ్ములకు రంగులు పూసి, పూలమాలలు, గజ్జెలతో అలంకరించి, ధూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించి క్షేత్రపాలకుని ఆశీర్వాదంతో నాగలితో భూమిని దున్ని విత్తనాలు చల్లే సంప్రదాయాన్ని పాటిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ రామరాజు, గోశాల పర్యవేక్షణ అధికారి మూల వాసు, దేవస్థానం జూనియర్ సహాయకులు, సాయి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఏరువాక ఉత్సవం సందర్భంగా గోశాల ప్రాంగణం ఆధ్యాత్మిక, సాంప్రదాయ వాతావరణంతో కళకళలాడగా, వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.



# మూల్పూరు వెంకటరత్నం జీవితం విలువల రాజకీయాలకు నిదర్శనం.





- ఎమ్మెల్యే యార్లగడ్డ.
- 1983 నుంచి టీడీపీకి జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన నాయకుడు.
- అభివృద్ధి పై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధం యార్లగడ్డ సవాల్.
- పేర్ని నాని, కొడాలి నాని కృష్ణా జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారు.
- జగన్ రాజకీయ పతనానికి పేర్ని, కొడాలి వైఖరే కారణం యార్లగడ్డ.
- కుటిల రాజకీయాలు నేను చేయను ప్రజల కోసమే పని చేస్తా.
- మంచితనాన్ని చేతగానితనంగా భావించొద్దు యార్లగడ్డ హెచ్చరిక.
- మూల్పూరు వెంకటరత్నం రాజకీయ జీవితాన్ని కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలి.

**హనుమాన్ జంక్షన్, పెన్ సత్తా, జూన్ 29:** బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ లోని కాకాని కళ్యాణ మండపంలో దివంగత మూల్పూరు వెంకటరత్నం (మునసబు) సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు హాజరై వెంకటరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వెంకటరత్నం 1983 నుంచి తెలుగుదేశం పార్టీ పట్ల జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. తాను వైసీపీలో ఉన్న సమయంలో కూడా వ్యక్తిగతంగా ఆప్యాయంగా మెలిగినా, పార్టీ పట్ల తన విధేయతను ఏమాత్రం విడిచిపెట్టలేదని గుర్తు చేశారు. రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు సహజమేనని, కానీ పార్టీ పట్ల అంకితభావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత ప్రతి కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. పోలవరం – ఏలూరు కాలువ అనుసంధానం రూ.38 కోట్ల నిధులు సాధించామని, అసెంబ్లీలో పోరాడి ఈ నిధులను తీసుకొచ్చానని అన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిల పై విమర్శలు చేస్తూ, కృష్ణా జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారని, జగన్మోహన్ రెడ్డి రాజకీయ పతనానికి వారిద్దరి వైఖరే కారణమని ఆరోపించారు. అభివృద్ధి పై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ఆయన, తాను కుటిల రాజకీయాలు చేయనని, ప్రజల హక్కులు, పార్టీ కార్యకర్తల గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మంచి తనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరిస్తూ, మూల్పూరు వెంకటరత్నం రాజకీయ జీవితాన్ని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మునసబు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.

# విశాఖలో నేడు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం.

- 373 మంది పట్ట భద్రులకు డిగ్రీ పట్టాలు, 13 మందికి బంగారు పతకాల ప్రదానం.
- ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న భారత రాష్ట్రపతి, హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు.
- విలేకరుల సమావేశంలో ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ టి. శ్రీనివాసన్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:** విశాఖపట్నంలో మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం స్థానిక దస్పల్లా హోటల్లో సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2025-26 విద్యా సంవత్సరాల వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన మొత్తం 373 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం కేంద్రంగా 2019 లో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటై, 2020 నుంచి తరగతులు ప్రారంభ మైనట్లు వివరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎనిమిది పీజీ కోర్సులు, ఐదు డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ నుంచి 200 మంది, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నుంచి 82 మంది, స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ నుంచి 91 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు వెల్లడించారు.

13 మందికి బంగారు పతకాలు, అందులో 11 మంది విద్యార్థినులే.

ఈ సందర్భంగా ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విశిష్ట ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో 11 మంది విద్యార్థినులు, ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగం నుంచి ఐదుగురు, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇద్దరు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ నుంచి ఇద్దరు బంగారు పతకాలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

ఛాన్సలర్ మదన్ లాల్ మీనా మాట్లాడుతూ స్నాతకోత్సవం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్య మైన మైలురాయి అని అన్నారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నవీన ఆలోచనలను అలవరచుకున్నప్పుడే యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదన్నారు. పట్టభద్రులు తమ విద్యను దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్య మైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఫౌండర్ వీసీ టి.వి. కట్టిమణి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.

# స్మార్ట్ పోలీసింగ్, ప్రజారక్షణే ధ్యేయం ఎస్పీ

- పోలీసులకు 35 బాడీ వార్న్ కెమెరాలను విరాళంగా అందించిన గ్లాండ్ ఫార్మా





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:** జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్ ను బలోపేతం చేయడానికి, ప్రజల భద్రతను మరింత మెరుగు పరచడానికి పరవాడ మండలం, జవహర్లాల్ నెహ్రూ ఫార్మా సిటీ లోని ప్రముఖ ఔషధ సంస్థ గ్లాండ్ ఫార్మా కంపెనీ (గ్లాండ్-ఫోసున్ ఫౌండేషన్) తమ సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద జిల్లా పోలీసు శాఖకు అండగా నిలిచింది. ఇందులో భాగంగా రూ.5,98,850/- విలువైన 35 సిపి ప్లస్ (సీపీ ప్లస్- ఈబీసీ 4413128జి) అత్యాధునిక బాడీ వార్న్ కెమెరాలను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కి జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీస్ విధుల్లో పారదర్శకతను పెంచడానికి, శాంతి భద్రతల పరి రక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు కోవడానికి ఈ బాడీ వార్న్ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్లాండ్ ఫార్మా కంపెనీ సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ, పోలీసు శాఖకు ఈ విధమైన వినూత్న సాంకేతిక పరికరాలను విరాళంగా అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ కంపెనీ యాజమాన్యానికి, ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో
?గ్లాండ్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు
ఎస్.శ్యామ్ సుందర్ (ప్లాంట్ హెడ్),
?కె.గణేష్ కుమార్ (ఏజిఎం హెచ్ఆర్డ అడ్మిన్ ), సి.హెచ్. జగన్నాధాచార్యులు (మేనేజర్ హెచ్ఆర్డ అడ్మిన్ ),
బి.మోహన రావు (పరవాడ సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ), భాస్కర్ రావు (పరవాడ ఇన్స్పెక్టర్), శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరును మరింత మెరుగుపరచడానికి ఇటువంటి సిఎస్ఆర్ కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సహకారం కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రైతును లాభాల బాట పట్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.



**నాదెండ్ల, పెన్ సత్తా, జూన్ 29:** దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా సాతులూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చి, రైతును రాజును చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. రైతాంగానికి ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు. భూమిని, పశుసంపదను, ప్రకృతిని అనుసంధానం చేస్తూ రైతులు జరుపుకునే పండుగ ఏరువాక పౌర్ణమి అని పుల్లారావు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నైరుతి రుతుపవనాలు, మృగశిర కార్తె ప్రవేశంతో పాటు, ఎల్నినో ప్రభావం ఉన్నప్పటికీ దానిని అధిగమించి రైతులు లాభసాటిగా పంటలు పండించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన భరోసా ఇచ్చారు.
గత వైకాపా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు.
గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పుల్లారావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత ఐదేళ్లలో రైతులను గాలికొదిలేశారని, కనీసం వ్యవసాయ పనిముట్లు కూడా అందించకుండా దగా చేశారని మండి పడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు రైతులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని ఆయన ఆరోపించారు. అడుగడుగునా అండగా కూటమి ప్రభుత్వం.
తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిందని పుల్లారావు తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, సాగునీరు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, రైతులకు ఏ సమయంలో ఏది అవసరమో దానిని అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం ఆలోచిస్తున్నారని కొనియాడారు.ఠచరిత్రలో తొలిసారిగా జులై 1 నే కృష్ణా జలాలు. సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పుల్లారావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జులై 1 వ తేదీనే కృష్ణా జలాలను విడుదల చేస్తున్నామని, తద్వారా రైతులు సకాలంలో సాగు ప్రారంభించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. సాగునీటి విడుదలలో ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. వ్యవసాయం లోకి గ్లోబల్ టెక్నాలజీ. ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, వనరులను ఆంధ్రప్రదేశ్ రైతులకు చేరువ చేయాలన్నదే టెక్నాలజీని వాడుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు.

# పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభంలో పాల్గొన్న ఐజీ, ఎస్పీలు.





ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్మాణం.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:** విశాఖపట్నం రేంజ్ పోలీస్ కార్యాలయ ఆవరణలో అత్యాధునిక సాంకేతిక వసతులతో నూతనంగా నిర్మించిన 'పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్' భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఎన్.టి.పి.సి సింహాద్రి సంస్థ తమ సామాజిక బాధ్యత (సీఎస్సార్) నిధులతో ఈ భవనాన్ని నిర్మించింది. ఈ నూతన కేంద్రాన్ని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, రేంజ్ పరిధి లోని జిల్లాల ఎస్పీలు దామోదర్ (విజయనగరం), తుహిన్ సిన్హా (అనకాపల్లి), మహేశ్వర్ రెడ్డి (శ్రీకాకుళం), కె.శ్రావణి (మెరైన్)లు సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పోలీస్ సేవల సామర్థ్యాన్ని పెంచే ఆధునిక వేదిక ఐజీ గోపీనాథ్ జట్టి. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ రేంజ్ పోలీస్ కార్యాలయంలో మౌలిక వసతుల కల్పన దిశగా ఇది ఒక మైలురాయి అని పేర్కొన్నారు. ఈ పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం రేంజ్ పరిధి లోని ఐదు జిల్లాల శాంతి భద్రతలను నిరంతరం పర్యవేక్షించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమాజ శ్రేయస్సు, అభివృద్ధి కార్యక్రమాల్లో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం ప్రశంసనీయమని, పోలీస్ యంత్రాంగానికి మెరుగైన సాంకేతిక వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు అందించే సేవల సామర్థ్యం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ భవన నిర్మాణానికి సి.ఎస్.ఆర్ నిధులు కేటాయించిన ఎన్.టి.పి.సి సింహాద్రి యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాంతి భద్రతల పరి రక్షణలో కీలక పాత్ర జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా. తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఈ ఆధునిక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ఎన్.టి.పి.సి సింహాద్రి సంస్థ అందించిన తోడ్పాటును కొనియాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరి రక్షణకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.

? ఈ కార్యక్రమంలో ఎన్.టి.పి.సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్.ఓ.పీ అయస్కాంత జన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగా రేంజ్ పోలీస్ కార్యాలయం అభివృద్ధికి మరియు పోలీసు శాఖ ఆధునీకరణకు తమ సంస్థ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని స్పష్టం చేశారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్.టి.పి.సి ఉన్నతాధికారులు శ్రీమంత మహాపాత్ర, ప్రకాశరావు, డీఎస్పీలు కిరణ్ కుమార్, రవికుమార్, ఇన్స్పెక్టర్లు మల్లికార్జునరావు, రాము, రామకృష్ణారావు, మన్మధరావు, ఏవో శ్రీమతి నాగలక్ష్మి, మేనేజర్ సూర్యారావు, ఐటీ కోర్ శ్రీధర్, రేంజ్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు







- రైతులకు రాయితీ పై విత్తనాలు - ఆధునిక యంత్రాల పంపిణీ.
- కొణతాల, పీలా లతో కలిసి మొదటి దుక్కు దున్నిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:** సాంప్రదాయం ప్రకారం, జేష్ట పౌర్ణమి ని అత్యంత శుభప్రద మైన రోజుగా భావించి, రైతులందరూ ఏరువాక పౌర్ణమి గా భావించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం కసింకోట మండలం, బయ్యవరం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర లతో కలసి ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా వ్యవసాయ భూమిలో భూదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాబోయే కాలంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. అనంతరం సాంప్రదాయబద్ధంగా పొంగలి, పులగం మరియు వివిధ నైవేద్యాలను భగవంతునికి సమర్పించి, పశువులకు నైవేద్యాన్ని తినిపించారు. ఈ క్రమంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ తో కలసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్వయంగా నాగలి పట్టి మొదటి దుక్కు దున్ని ఈ సంవత్సరపు సాగు పనులకు అత్యంత వైభవంగా నాంది పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో మంచి ముహూర్తాన రైతులు పొలాల్లో దుక్కి దున్నే పనులను ఘనంగా ప్రారంభిస్తారని, ఈ ఏడాది పాడి-పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. వ్యవసాయాన్ని మరింత సులభతరం, ఆధునీకీకరించేందుకు ప్రభుత్వం భారీ సబ్సిడీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. డ్రోన్లు, ట్రాక్టర్లతో పాటు వివిధ రకాల ఆధునిక వ్యవసాయ పనిముట్లను తక్కువ ధరకే (రాయితీపై) రైతులకు అందజేస్తున్నామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఖరీఫ్ సీజన్‌కు కావలసిన నాణ్యమైన విత్తనాలను రైతులకు రాయితీ ధరకు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, సరికొత్త మొబైల్ యాప్ ద్వారా యూరియా పంపిణీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల రైతులకు సకాలంలో ఎరువులు అందుతాయని, కాబట్టి ఎరువుల



కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన లేదా కంగారు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అన్ని విధాలా అండగా నిలిచేందుకు వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. ఆశా దేవి, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.







# ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.

వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:** ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్ ను తనిఖీల్లో భాగంగా సోమవారం ఉదయం రెవిన్యూ డివిజనల్ అధికారి ఆయేషా తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోడౌన్ లోపల భాగంలో కూడా పర్యటించారు. అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్ లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై నేతలతో మాట్లాడారు. భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను జాయింట్ కలెక్టర్ కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, ఎలక్షన్ సెల్ సూపర్డెంట్ వాసు నాయుడు, టిడిపి నుండి బి శ్రీనివాసరావు, ఏ ఏ పి నుండి కే హరినాథ్ బాబు, జేఎస్పీ నుండి డి. వేణుగోపాలకృష్ణ , స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







# రైతులకు దేవస్థానం తరపున సత్కారం





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 29:**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన గవరపాలెం వెలసిన నూకాంబిక అమ్మవారికి దేవస్థానంలో సోమవారం జేష్ట మాసం ఏరువాక పౌర్ణమి సందర్భంగా అనకాపల్లి పట్టణానికి చెందిన రైతులను దేవస్థానం తరపున అమ్మవారి దర్శనం చేయించి, ఘనంగా సత్కరించి, ఆశీర్వాదం, పంచె కండువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, దేవదాయ శాఖ బంగారు ఆభరణాల తనిఖీ అధికారి పల్లవ రాజు, ఆలయ ధర్మకర్తలు
సూరే సతీష్, దాడి రవి కుమార్,
పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడ్రాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.ం

# బయో ఫెర్టిలైజర్, నానో ఎరువుల వాడకం పై రైతులకు శిక్షణ కార్యక్రమం.





**రాంబిల్లి, పెన్ సత్తా, జూన్ 29:** మండలం లోని మామిడివాడ గ్రామంలో సోమవారం ఆత్మ ఆధ్వర్యంలో బయో ఫెర్టిలైజర్, నానో ఎరువుల వాడకం పై రైతులకు శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నేల ఆరోగ్య పరి రక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల పై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో మట్టి నమూనాల సేకరణ ప్రాముఖ్యత, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల ఉపయోగాల గురించి వివరించారు. అలాగే అధికంగా యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు.

రైతులు మధ్య చర్చా కార్యక్రమం నిర్వహించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, వాతావరణ మార్పులకు అనుగుణ మైన వ్యవసాయ పద్ధతుల గురించి సమాచారం అందించారు.

కార్యక్రమంలో పి.శ్రీధర్ (ఏడిఏ డిఆర్సి అనకాపల్లి)

మాట్లాడుతూ రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల నేల సారం తగ్గి, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులను కూడా తగ్గించు కోవచ్చని సూచించారు. పి.శ్రీహరి (బీసీటీ శాస్త్రావేత్త) మాట్లాడుతూ వరి పంటలో తీసుకోవాల్సిన పద్ధతులను రైతులకు సూచనలు అందించారు. మండల వ్యవసాయ అధికారి సి హెచ్ సుమంత మాట్లాడుతూ ఏపీఎఐఎంఎస్ ద్వారా ఎరువులు సరఫరా గురించి రైతులకు వివరించడం జరిగినది. పి.విజేత వ్యవసాయ అధికారి జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి మాట్లాడుతూ విత్తన శుద్ధి యొక్క ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఈఓ రామారావు, ఏఈఓ దేముడు, రైతులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలుచేయాలి

- 25 శాతం ఉచిత ప్రవేశాలు తప్పనిసరి
- మండల విద్యాశాఖాధికారి1. కె నరేష్



**నక్కపల్లి, పెన్ సత్తా,జూన్ 29:**మండలంలో అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని స్థానిక మండలవిద్యాశాఖాధికారి1 కే.నరేష్ అన్నారు.సోమవారం మండలంలో చుక్కలవాని లక్ష్మీపురం లో ప్రేమ్ సాయి ప్రైవేట్ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు ఆదేశాల మేరకు ఫోర్ మేన్ కమిటి సభ్యులు ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కుచట్టం ద్వారా 25శాతం విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాలన్నారు. ఎక్కడా ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేయరాదని ఆయన తెలిపారు. ముఖ్యంగా పాఠశాలల ప్రవేశాల సమయంలో టెక్స్ట్ బుక్స్,నోట్స్ లు, బ్యాగులు, బూట్లు వంటి వి పాఠశాల ఆవరణలో విక్రయించకూడదని ఆయన అన్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనలను ప్రతీ పాఠశాలలో అమలుచేయాలని లేకుంటే కఠిన చర్యలు తప్పని తెలిపారు.ఈ ఫోర్ మెన్ కమిటీలో మండలవిద్యాశాఖాధికారి2 రుత్తల నాగన్నదొర, నోడల్ హెచ్.ఎమ్ వేమగిరి నూకరాజు, కమిటీ సభ్యులు వి.బాలాజీ తదితరులు ఉన్నారు.

# న్యాయంపూడి వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- స్కూటీని వెనక నుండి వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడకక్కడే మహిళ మృతి






**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 29**:
నక్కపల్లి మండలం న్యాయంపూడి వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడకక్కడే మహిళ మృతి చెందింది. ఈ ఘటనలో ఆమె భర్తకు గాయాలయ్యాయి.
నక్కపల్లి సి ఐ జె. మురళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పెందుర్తి గ్రామం వెలమ పేటకు చెందిన ఓలుపల్లి ఈశ్వరరావు, భార్య గాయత్రి (26) ఇద్దరూ కలిసి సోమవారం ఉదయాన్నే స్కూటీ పైన పెందుర్తి నుంచి బయలుదేరి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి దైవ దర్శనానికి వెళ్తుండగా నక్కపల్లి మండలం,న్యాయంపూడి గ్రామ సమీపంలో అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే ఎన్ హెచ్ -16 రహదారిలో స్కూటీ వెనకనుంచి వస్తున్న వెస్ట్ బెంగాల్ కు చెందిన ఐసర్ వ్యాన్ స్కూటీని బలంగా ఢీ కొట్టి స్కూటీ ముందు ఉన్న కంటైనర్ లారీని కూడా బలంగా ఢీకొట్టడంతో స్కూటీ లో వెనుక కూర్చున్న గాయత్రి స్కూటీ పైనుండి తూలి రెండు వాహనాలకు మధ్యలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందింది. ఐసర్ వ్యాన్ క్యాబిన్ కు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ఘటనలో స్కూటీ డ్రైవింగ్ చేస్తున్న ఓలుపల్లి ఈశ్వరరావుకు ఎడమ కాల మీద స్వల్ప రక్త గాయాలు అయ్యాయని సిఐ మురళి తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే నక్కపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి 50 పడకల ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఈశ్వరరావుకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. మృతురాలు భర్త ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.

# రిహాబిలిటేషన్ ఆఫ్ డ్రగ్ అండ్ ఆల్కహాలిక్ ఎడిట్స్.




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 29:**పోలీస్ కమీషనర్ ఏ.ఆర్. గ్రౌండ్ దగ్గర గల కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్ర హోం శాఖామాత్యులు విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, రిహాబిలిటేషన్ ఆఫ్ డ్రగ్ అండ్ ఆల్కహాలిక్ ఎడిట్స్ సంబందించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, వారి సిబ్బంది డ్రగ్స్, ఆల్కహాల్, మాదకద్రవ్యాల మత్తుకు బానిస లైన వారిని గుర్తించి, వారిని డీ-అడిక్షన్ డ రిహాబిలిటేషన్ కేంద్రాలకు పంపించి చికిత్స అందిస్తున్నారు అన్నారు. చికిత్స అనంతరం కోలుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా వారు సమాజంలో గౌరవప్రద మైన జీవితాన్ని గడిపేలా చేయడం ద్వారా డ్రగ్స్ రహిత విశాఖపట్నం నగరం లక్ష్య సాధన దిశగా ముందుకు సాగడం చాలా గర్వంగా ఉందని కొనియాడారు. పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాలకు బానిస లైన వ్యక్తులను పోలీస్ కంట్రోల్ రూమ్ (పీసీఆర్) ఇన్‌స్పెక్టర్, వారి సిబ్బంది, పోలీస్ స్టేషన్ ల సిబ్బంది సహకారంతో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మాదకద్రవ్య వ్యసన విముక్తి చికిత్స యొక్క ప్రాముఖ్యత, పునరావాసం యొక్క అవసరం పై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించడ మైనది. కౌన్సెలింగ్ సందర్భంగా వారు స్వచ్ఛందంగా చికిత్స పొందేందుకు, మాదకద్రవ్య వ్యసనం నుండి బయటపడి ఆరోగ్యవంత మైన, బాధ్యతాయుత మైన, చట్టబద్ధ మైన జీవనం గడపడానికి ప్రోత్సహించడ మైనది. అనంతరం, వారికి తగిన వైద్య చికిత్స, డీటాక్సిఫికేషన్, కౌన్సెలింగ్ మరియు పునరావాసం కోసం క్రింది గుర్తింపు పొందిన మాదకద్రవ్య వ్యసన విముక్తి, పునరావాస కేంద్రాలకు
గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ సీడ్ ఆర్గనైజేషన్, న్యూ లైఫ్ ఇంటిగ్రేటెడ్ రీహాబిలిటేషన్ సెంటర్, డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్, కింగ్ జార్జ్ హాస్పిటల్ రిఫర్ చేయడ మైనది అని తెలిపారు. చికిత్స పునరావాస కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, ఉద్యోగం చేయడానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు వివిధ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో తగిన ఉపాధి లేదా జీవనోపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్వయం ఉపాధిని సాధించి ఆర్థికంగా స్థిరపడడంతో పాటు తిరిగి మాదకద్రవ్యాల బారిన పడకుండా నివారించవచ్చు అని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 24 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాము అని, అందులో 17 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించగా, మరో 7 మందికి ఉపాధి కోసం వాహనాలను అందజేశాము అని వారి వివరాళ్ళు తెలియపరిచారు.
3 గ్గురికి ఆటోరిక్షాలు, 4 లుగురికి ద్విచక్ర వాహనాలు అందజేయగా వారు ప్రస్తుతం బ్లింకిట్, రాపిడో, ఉబెర్, స్విగ్గీ, వంటి సంస్థల ద్వారా ఉపాధి పొందుతున్నారు అని, ఎస్ఆర్ కంపెనీలో 5 మంది హెల్పర్/సూపర్వైజర్లుగా, హెచ్‌పీసీఎల్‌లో 1 వ్యక్తి హెల్పర్‌గా, హోటళ్లలో ఇద్దరు వ్యక్తులు, బార్బర్లుగా ఇద్దరు వ్యక్తులు, డీటీపీ సెంటర్‌లో 1 వ్యక్తి, సెక్యూరిటీ గార్డ్‌గా 1 వ్యక్తి, కీస్ మేకర్‌గా 1 వ్యక్తి, ఫిష్ ప్యాకింగ్ విభాగంలో 1 వ్యక్తి, కూరగాయల దుకాణంలో 1 వ్యక్తి, ఆఫీస్ బాయ్‌గా 1 వ్యక్తి, మెకానిక్ షాప్‌లో 1 వ్యక్తి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం, ఉపాధి కల్పన వంటి సమగ్ర చర్యల ద్వారా మాదకద్రవ్య వ్యసనానికి గురైన వ్యక్తులను తిరిగి సమాజంలో గౌరవప్రద మైన జీవితాన్ని గడిపేలా చేయడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం, డ్రగ్ సంబంధిత నేరాలను తగ్గించడం, విశాఖపట్నం నగరంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యం అని తెలిపారు.

# ఐఐటిలో ఎంపికైన 18 మంది విద్యార్థినులకు ఘన సన్మానం.

- ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా ఉచిత యూపీఎస్సీ కోచింగ్ పుస్తకాల పంపిణీ
- బీఎస్ఆర్ పాఠశాల నుండి ఐఐటిలో ఎంపికైన 18 మంది విద్యార్థినులకు ఘన సన్మానం.
- ప్రతిభను ప్రోత్సహించడంలో సత్యకుమార్ ఎల్లప్పుడూ ముందుంటారు హరీష్ బాబు.
- ఐఐటితో ఆగొద్దు... ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా ముందుకు సాగాలి.
- కలలు కనండి... కష్టపడండి... దేశసేవలో నిలవండి హరీష్ బాబు.

**ధర్మవరం, పెన్ సత్తా, జూన్ 29:** ధర్మవరం పట్టణం లోని బిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల ఐఐటిలో ఎంపి కైన 18 మంది విద్యార్థినులకు సోమవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు పాఠశాల ఆవరణలో ఈ ప్రత్యేక ప్రోత్సాహ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇటీవల నిర్వహించిన ఐఐటి ఎంపికల మొదటి విడతలో 15 మంది విద్యార్థినులు ఎంపిక కాగా, అనంతరం జరిగిన కౌన్సెలింగ్‌లో మరో 3 మంది విద్యార్థినులు ఎంపిక కావడంతో మొత్తం 18 మంది విద్యార్థినులు ఈ అరుదైన ఘనతను సాధించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, అభిరామ్ ఐఏఎస్ అకాడమీ సీఈవో అభిరామ్, బిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పాల్గొని విద్యార్థినీలకు సివిల్ సర్వీసెస్‌కు అవసరమైన ఎన్సిఆర్టి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసి, విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో, సంస్కృతి సేవ సమితి సహకారంతో, హైదరాబాద్‌కు చెందిన అభిరామ్ ఐఏఎస్ అకాడమీ ద్వారా ఈ 18 మంది విద్యార్థినులకు ఉచిత యూపీఎస్సీ (ఐఏఎస్/ఐపీఎస్) కోచింగ్ అందించడం జరుగుతుంది, ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఐఐటిలో సీట్లు సాధించడం ధర్మవరానికి గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థినులు ఐఐటిలో ప్రవేశం సాధించడం గొప్ప విజయమే కాకుండా, భవిష్యత్తుకు బలమైన పునాది. ఇక్కడితో ఆగకుండా మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసుల్లో రాణించి, సమాజానికి సేవ చేయాలి. మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పేద మరియు ప్రతిభావంతు లైన విద్యార్థులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారు అని అన్నారు. విద్యార్థినుల ప్రతిభను గుర్తించి వారికి ఉన్నత విద్యతో పాటు సివిల్ సర్వీసుల దిశగా మార్గనిర్దేశం చేయడం ద్వారా ధర్మవరం నుంచి మరింత మంది జాతీయ స్థాయి ప్రతిభావంతులు ఎదగాలని హరీష్ బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, అభిరామ్ ఐఏఎస్ అకాడమీ సీఈవో అభిరామ్, ప్రసాద్, యువర్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ నాగేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్.

**ములకలపల్లిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్.**

**పెన్ సత్తా, జూన్ 29:**జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ములకలపల్లి మండలంలో పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంతో పాటు ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.
మొదట ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఫారాల పంపిణీ సందర్భంగా ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లే సమయంలో ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా కలుసుకుని అవసరమైన వివరాలను నమోదు చేయాలని, ఏ ఒక్క అర్హుడూ మిగిలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
అనంతరం దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఓటరు జాబితా సవరణను పూర్తిస్థాయి పారదర్శకతతో, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన ఫారాలను గడువులోపు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.
అనంతరం ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, పరిశు భ్రత, రోగులకు అందిస్తున్న చికిత్స విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇన్‌పేషెంట్ వార్డు, ఔట్‌పేషెంట్ వార్డు, ప్రసూతి గది, రక్త పరీక్షల గది, ఫార్మసీ, ఔషధ నిల్వ కేంద్రం, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.
ఆసుపత్రికి రోజువారీగా వచ్చే ఔట్‌పేషెంట్ల సంఖ్య, చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్ల సంఖ్య, నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా, ఔషధ నిల్వలు ఎంత మేరకు ఉన్నాయో పరిశీలించారు. అవసరమైన మందులు, పరీక్షా సామగ్రి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రిని తగినంతగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.
ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, సురక్షితమైన తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.
ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ స్వాతి బిందు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి కళ్యాణ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకృష్ణ, మెడికల్ సిబ్బంది ఇమ్రాన్, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తదితరులు పాల్గొన్నారు.

# సోర్ట్స్

# స్టోక్స్ వీడ్కోలు టెస్టులో ఇంగ్లండ్ ఓటమి..
# సిరీస్ న్యూజిలాండ్ కైవసం..!

స్వదేశంలో బజ్‌బాల్ ఆటతో రెచ్చిపోయే ఇంగ్లండ్‌ను న్యూజిలాండ్ చిత్తుగా ఓడించింది. ఓవల్ టెస్టులో విజయంతో సిరీస్ సమం చేసిన కివీస్ నాటింగ్‌హమ్ టెస్టులో 160 పరుగులతో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఛేదనలో తడబడిన ఆతిథ్య జట్టు.. ఫౌల్క్స్(3-52) ధాటికి కుప్పకూలింది. జేమీ స్మిత్(60)అర్ధ శతకంతో పోరాడినా గట్టెక్కించలేకపోయాడు. ఫలితంగా టెస్టు సిరీస్‌లో వెనకబడిన న్యూజిలాండ్..2-1తో విజేతగా నిలవడం ఇదే మొదటిసారి. ఇక మ్యాచ్ మధ్యలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బెన్ స్టోక్స్‌ను ఈ పరాజయం మరింత బాధించనుంది. సిరీస్ విజేతను నిర్ణయించే నాటింగ్‌హమ్ టెస్టులో తొలి రోజే ఆధిపత్యం చెలాయించిన న్యూజిలాండ్‌ను ఇంగ్లండ్‌ను మట్టకరిపించింది. రెండో ఇన్నింగ్స్‌ను 288-9 వద్ద డిక్లేర్ చేసిన కివీస్.. ఐదోరోజు ప్రత్యర్థిని పడగొట్టింది. జకారీ ఫౌల్క్స్(3-52) విజృంభణతో టాపార్డర్ విఫలమవ్వగా.. జేమీ స్మిత్(60), గస్ అట్కిన్సన్(19)లు ప్రతిఘటించారు. లంచ్‌కు వెళ్లిన ఇంగ్లండ్.. కాసేపటికే మూడు వికెట్లు కోల్పోయింది. దాంతో, చివరి మ్యాచ్ ఆడుతున్న కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు విజయంతో వీడ్కోలు పలకాలనుకున్న ఆతిథ్య జట్టు ఆశలు ఆవిరయ్యాయి.

**డకెట్ శతకంతో..**

తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా బదులిచ్చింది ఇంగ్లండ్. ఓపెనర్ బెన్ డకెట్(113) శతకంతో భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. మరో ఎండ్‌లో కుర్రాడు జాకబ్ బెథెల్(74) అర్ధ శతకంతో భయపెట్టాడు. కానీ, న్యూజిలాండ్ పేసర్లు మూడో రోజు ఆరంభంలోనే రెచ్చిపోయారు. నాథన్ స్మిత్(4-91), జకారీ ఫౌల్క్స్(3-35), విలియం ఓ రూర్కీ(3-53)లు వికెట్ల వేటతో స్టోక్స్ సేనను పడగొట్టారు.



బెన్ డకెట్(113), జాకబ్ బెథెల్(74)

విలియం ఓ రూర్కీ(3-53) ధాటికి తొలి సెషన్‌లోనే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు.. తొలి ఇన్నింగ్స్‌లో 354కే ఆలౌటైంది. కివీస్‌కు 84 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. తొలుత టామ్ లాథమ్(151), డెవాన్ కాన్వే(157)ల శతకాలో న్యూజిలాండ్ 438 పరుగులు చేసింది.

## హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జైత్రయాత్ర.. వరుసగా నాలుగో విజయం



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. సోమవారం అన్విత ఖమ్మం ఏసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈ-ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 211పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఖమ్మం 155/9 పరుగులకు పరిమితమైంది. హిమతేజ (64; 44 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కడే పోరాడాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. వాఫి కచ్చి (21), సహేంద్ర మల్లు (16), విద్యానంద రెడ్డి (16) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్ శ్రీనికేత్ (3/28) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అజయ్‌దేవ్ గౌడ్ 2, గడుగు గణేశ్ 2, షణ్ముఖ అశ్విన్, అన్విత్ రెడ్డి ఒక వికెట్ తీశారు. ఖమ్మంకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది రెండో ఓటమి. తొలుత హైదరాబాద్ బ్యాటర్లలో ఓపెనర్, కెప్టెన్ అభిరథ్ రెడ్డి (59; 26 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఆఖర్లో గడుగు గణేశ్ (44; 21 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. సాయివికాస్ (22), అన్విత్‌రెడ్డి (32), షణ్ముఖ అశ్విన్ (19), ప్రణవ్ వర్మ (18) రాణించారు. అభిరథ్ రెడ్డి ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. విద్యానంద రెడ్డి, సాకేత్ బౌలింగ్‌లో ఒక్కో సిక్స్ బాదిన హైదరాబాద్ కెప్టెన్.. మహేశ్ విప్పర్ల వేసిన నాలుగో ఓవర్‌లో వరుసగా 4, 4, 6, 6 బాదేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విద్యానంద వేసిన ఐదో ఓవర్‌లో వరుసగా 6, 4, 4, 4తో విరుచుకుపడి 18 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. దీంతో ఐదు ఓవర్లకే ఈ-ఛాంపియన్స్ 67/0తో నిలిచింది. అభిరథ్‌ను వేద్ రెడ్డి పెవిలియన్‌కు పంపి ఖమ్మంకు బ్రేక్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన బ్యాటర్లు తలో చేయి వేసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. చివర్లో గణేశ్ దూకుడుగా ఆడటంతో స్కోరు 200 దాటింది. ఖమ్మం బౌలర్లలో సాకేత్, వేద్ రెడ్డి, సహేంద్ర తలో 2, జీఎస్‌కే రెడ్డి ఒక వికెట్ పడగొట్టారు.

## 2028 ఒలింపిక్స్.. అర్హత సాధించిన భారత మహిళల క్రికెట్ జట్టు

ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించి బాధలో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టుకు గుడ్‌న్యూస్. 2028 ఒలింపిక్స్‌కు హర్మన్‌ప్రీత్ సేన అర్హత సాధించింది. ఈ మేరకు ఐసీసీ, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ధ్రువీకరించాయి. ప్రస్తుతం జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా సెమీ ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. అయితే, ఈ టోర్నీలో ఆసియా తరఫున భారత్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. దీంతో భారత జట్టు ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా కూడా క్వాలిఫై అయ్యాయి. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్ గేమ్స్ జరగనున్నాయి. 1900లో ఒక్కసారి మాత్రమే ఒలింపిక్స్‌లో భాగమైన క్రికెట్.. 2028లో పునరాగమనం చేయబోతున్న సంగతి తెలిసిందే. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలను ఆరు జట్లతో నిర్వహించనున్నారు.





## కృతి శెట్టి పారితోషికం- బ్రాండ్ పబ్లిసిటీ ఆదాయం రేంజ్?

టాలీవుడ్ లో -ఉప్పెన- చిత్రంతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన బ్యూటీ కృతి శెట్టి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉండటమే కాకుండా సోషల్ మీడియా వేదికగా వాణిజ్య ప్రకటనల (బ్రాండ్ ప్రమోషన్స్) ద్వారా భారీగా ఆర్జిస్తోంది. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్లతో పాటు క్రేజీ బ్రాండ్స్ ప్రమోషన్లను షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. కృతి శెట్టి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసే ఒక్కో యాడ్ కోసం ఎంత డిమాండ్ చేస్తోంది? లూయిస్ వీట్టన్ బ్రాండ్ ప్రమోషన్ కోసం ఏడాది కాంట్రాక్ట్‌కు గానూ ఎంత పారితోషికం అందుకుంటుందనేది ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.

తాజాగా కృతి శెట్టి గ్లోబల్ లగ్జరీ బ్రాండ్ లూయిస్ వీట్టన్ ప్రమోషనల్ ఫోటోషూట్‌ను అభిమానులతో షేర్ చేసింది. హైదరాబాద్‌లో జరిగిన లూయిస్ వీట్టన్ కారవాన్ ఈవెంట్‌లో పాల్గొన్న కృతి శెట్టి దానికి సంబంధించిన స్టైలిష్ ఫోటోలను షేర్ చేసింది. లగ్జరీ బ్రాండ్ల ప్రమోషన్స్‌కు కేరాఫ్‌గా మారుతున్న కృతి.. కేవలం ఫ్యాషన్ బ్రాండ్స్ మాత్రమే కాకుండా ప్రముఖ బ్యాంకింగ్ సర్వీస్ -మాస్టర్ కార్డ్ ఇండియా- వాణిజ్య ప్రకటనలో బాలీవుడ్ యంగ్ హీరో ఇషాన్ ఖట్టర్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం.

బ్రాండ్స్ ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తున్న కృతి శెట్టి, ప్రముఖ జువెలరీ సంస్థ -ఇంద్రియ జువెలర్స్- ప్రకటనలోనూ నటించి మెప్పించింది. అక్షయ తృతీయ సందర్భంగా సంప్రదాయబద్ధమైన టెంపుల్ గోల్డ్ జువెలరీ ధరించి చేసిన ఈ ప్రమోషనల్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

చిన్నతనం నుండి తన కుటుంబంలో ఉన్న సాంప్రదాయాలు, గుడి సందర్శనల జ్ఞాపకాలను ఈ ప్రత్యేకమైన జువెలరీ కలెక్షన్ ప్రతిబింబిస్తోందని కృతి శెట్టి ఈ సందర్భంగా పేర్కొంది. బ్రాండ్స్ ని ఇన్ స్టాలో ప్రమోషన్స్ చేయడం కోసం ఒక్కో పోస్టుకు 2లక్షల వరకూ ఛార్జ్ చేస్తోందట. అలాగే ఒక్కో కాంట్రాక్టుకు 20లక్షల నుంచి 30లక్షల వరకూ అందుకుంటోందని సమాచారం. ఇక నటిగాను ఒక్కో సినిమాకి .. ప్రాజెక్ట్ స్థాయిని బట్టి కృతి శెట్టి సుమారు 50 లక్షల నుండి 1 కోటి వరకు పారితోషికం తీసుకుంటున్నారు. 2021లో భారీ విజయం సాధించిన తన తొలి చిత్రం -ఉప్పెన- కోసం ఈ యంగ్ బ్యూటీ 6లక్షల పారితోషికం తీసుకుంది. ఆ తర్వాత తన రేంజ్ 50లక్షలకు పెరిగింది.ఒకవైపు బ్రాండ్ ఎండార్స్‌మెంట్లతో దూసుకుపోతున్న కృతి శెట్టి, మరోవైపు వైవిధ్యమైన పాత్రలతో నటిగానూ మెప్పిస్తోంది. తాజాగా దర్శకుడు విఘ్నేష్ శివన్ కాంబినేషన్‌లో కృతి నటించిన -లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ- అనే చిత్రంలో నటించింది. ఈ సినిమాలో కృతి పోషించిన ధీమ అనే గ్లామర్ డాళ్ పాత్రకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది. బాల్యంలో ఎదురైన కొన్ని చేదు అనుభవాల వల్ల ప్రేమ కోసం తపించే -ధీమ- లాంటి ఎమోషనల్ క్యారెక్టర్‌ను తాను వ్యక్తిగతంగా ఎంతో కనెక్ట్ అయి చేశానని, ప్రేమ అనేది ఎవరివద్దో సంపాదించుకునేది కాదని.. అది సహజంగా లభించేదనే సందేశం తనకు బాగా నచ్చిందని కృతి శెట్టి పేర్కొంది. కృతి నటించే తదుపరి సినిమాల వివరాలను త్వరలోనే వెల్లడించనుందిట.



బోల్డ్ బ్లేజర్ లుక్‌లో తన ఆధునిక గ్లామర్ శైలిని ప్రదర్శిస్తూ ఆకట్టుకుంటున్న రుక్షార్ ధిల్లాన్

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com